

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

గురువారం | 24 ఏప్రిల్ 2025 | పేజీలు 8



## ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

**చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్**

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయంమెండుగా ఉంటుందని, ఆర్ఎస్కెల ద్వారా ఆయిల్ పామ్ సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం పెంపుపై జిల్లా కలెక్టర్ వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చెరకు పంట ప్రధాన పంటగా ఉన్నదని, చెరకు పంటకు బదులుగా మార్కెట్‌లో వంట నూనెల డిమాండ్ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఆయిల్ పామ్ మొక్కల పెంపకంతో రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. పంటనష్టం చాలా తక్కువ శాతం ఉంటుందన్నారు. జిల్లాలో కార్వేటినగరం, జి.డి. నెల్లూరు, నింద్ర, నగరి, విజయపురం, ఎస్.ఆర్.పురం మండలాలలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయన్నారు. 3ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్, అమ్మా పామ్ ప్లాంటేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల ద్వారా ఆయిల్ పామ్ పంట సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించామన్నారు. చెరకు, మామిడి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేసేలా మండలాల్లో ఆర్ఎస్కె సిబ్బంది

మిగతా 2లో

# పెట్రేగుతున్న రేషన్ మాఫియా

**నాయుడుపేటలో యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం**

**చోద్యం చూస్తున్న అధికారులు**




**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** పట్టణంలో రేషన్ బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. తమ అక్రమ వ్యాపారాన్ని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తోంది. అధికారుల అండదండలతో ప్రతి రోజూ వందలాది టన్నుల బియ్యంను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ముడుపులు తీసుకుని అన్నివిధాలా సహకారం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పేదల బియ్యం అక్రమ వ్యాపారం నాయుడుపేట పట్టణంలో జోరుగా సాగిపోతోంది. ఈ రేషన్ మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయి అధికారులు మా చేతిలో ఉన్నారు వారికి నెల నెల అన్ని ఇస్తున్నామంటూ దర్జాగా వ్యాపారం చేసుకుంటున్నారు. అధికారులు రేషన్ మాఫియాతో కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని సాగిస్తున్నారు అని ఆరోపణలు లేకపోలేదు.

**నాయుడుపేటలో బియ్యం అక్రమ నిల్వలు..**

నాయుడుపేట పట్టణంలో అనేక ప్రాంతాల్లో అగ్రహార పేట, లోత్వాని గుంట, పోగొట్టం, బేరిపేట, గాంధీ మందిరం వివిధ ప్రాంతాల్లో అక్రమ రేషన్ బియ్యాన్ని నిలువచేసి రాత్రి పగలు తేడా లేకుండా తరలిస్తున్నారు. ఈ అక్రమ రేషన్ బియ్యం వ్యాపారం చేస్తూ రోజుకు లక్షల్లో ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. బియ్యం వ్యాపారం జోరుగా సాగుతున్నాత

మిగతా 2లో

## అవినీతి లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

**ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్**

**మధ్యవర్తులను నమ్మకండి**

**ప్రజల సేవ కోసమే రాజకీయాలకు వచ్చా**

**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** గంగాధర నెల్లూరు నియోజకవర్గాన్ని అవినీతి లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్నదే తన సంకల్పమని గంగాధర నెల్లూరు శాసన సభ్యులు డాక్టర్ వి.ఎం.థామస్ అన్నారు. బుధవారం వెదురుకుప్పం మండలం పెరుమాళ్ళపల్లి సచివాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్జీదారులు మధ్యవర్తులను నమ్మి మోసపోకూడదని, సమస్య ఉన్నవారు తనను నేరుగా గాని, ఫోన్ల ద్వారా గాని సంప్రదించాలని కోరారు. ఎమ్మెల్యే తనకు బాగా తెలుసునని మాయమాటలు చెప్పి ఫిర్యాదుదారుల వద్ద డబ్బులు వసూలు చేసే వారిని నమ్మరాదని ఎమ్మెల్యే సూచించారు. ప్రజాసేవకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, తనకు ఓట్లు వేసి గెలిపించిన ఓటర్లను దేవుళ్ళు లాగా చూసుకుంటానన్నారు. అర్జీదారుల నుండి డబ్బులు వసూలు చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై అధికారులుఏడు రోజులలోపు సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలన్నారు. కోర్టులకు సంబంధించిన సమస్యలు ఉంటే వారికి విపులంగా వివరించి సమాధానం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ప్రతి అర్జీపై అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. ప్రతి బుధవారం జరగాల్సిన ప్రజా ఫిర్యాదుల వేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మార్పు చేయడం జరిగిందన్నారు. దీనిని నియోజకవర్గ ప్రజలు గమనించాలన్నారు. వేసవి తాకిడిని దృష్టిలో ఉంచుకొని



మిగతా 4లో

## నగరంలోని సుందరీకరణ పనులు, వేగంగా పూర్తి చేయాలి

**తిరుపతి కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరంలోని పలు ట్యాంకులు(కుంటలు) సుందరీకరణ పనులను ప్రాధాన్యతగా తీసికొని యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.వెంకటేశ్వర్ తెలిపారు. బుదవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు తిరుపతి నగరం లోని వివిధ ట్యాంకర్ల సుందరీకరణ పనుల పురోగతి పై జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి, శ్రీకాళహస్తి, ఆర్డిఓలు రామ్మోహన్, భాను ప్రకాష్, డ్వామా పిడి శ్రీనివాసప్రసాద్, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి వనరులను అభివృద్ధి చేయడానికి ట్యాంకుల పునరుద్ధరించడంకోసం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యం గాదామినేడు, పేరూరు, ఆవిలాల రామక్క చెరువు, తూకివాకవెంకటాపురం, వెలమండ్యం వినాయక సాగర్, పాన్ చెరువు, గొల్లవాని గుంట, కోరమేనుగుంట చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా స్మార్ట్ సిటీ లో భాగంగా వినాయకా సాగర్, గొల్లవాణి గుంట ఇప్పటికే అభివృద్ధి చేశారని, మిగిలిన వాటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొరమేనుగుంట చెరువుకు సంబందించిన వాకింగ్ ట్రాకర్స్, ప్లాంటేషన్ సంబంధించిన అభివృద్ధి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు.



## పదిలో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

### గుణపాడులో 97 శాతం ఉత్తీర్ణత... మెట్టు విద్యార్థికి 577 మార్కులు

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** బుధవారం విడుదలైన 10 ఫలితాల్లో చిట్టమూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.మండలంలోని 9ఉన్నత పాఠశాలలకు చెందిన 347 మంది విద్యార్థులకు గాను 254 మంది విద్యార్థులు పాసై 82 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ఎంఈఓ-2 కరణం వెంకటేశ్వర ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గుణపాడు ఉన్నత పాఠశాల 97ఉత్తీర్ణత శాతం సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలువుగా, మండలంలో మొదటి రెండు స్థానాల్లో మెట్టు ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ సింధు 577,573 మార్కులు



సాధించారు.మరో 24 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు.మండలంలోని అరవపాలెం సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాల70 శాతం, ఆరూరు77, చిట్టమూరు73, మల్లాం82, మెట్టు90, మొలకలపూడి 83,యాకశిరి69,ఈశ్వర్వాక 76 శాతం ఉత్తీర్ణత నమోదయినట్లు తెలిపారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఉత్తీర్ణత శాతం సాధించడం పై ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అభినందించారు.ఆయా పాఠశాలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను,ఉత్తీర్ణత శాతం సాధనకు పని చేసిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖాఅధికారి-2 కరణం వెంకటేశ్వర ప్రసాద్ అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదిలో మెరిసిన కుప్పం పబ్లిక్ స్కూల్ ఆణిముత్యాలు

**కుప్పం, మేజర్‌న్యూస్:** బుధవారం విడుదల చేసిన యస్.యస్.సి - 2025 ఫలితాలలో



కుప్పం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ మార్కులతో, కుప్పం పట్టణంలో అగ్రగ్రామి మార్కులతో ఘన విజయం సాధించారు. కిరణ్ కుమార్ 586/600 మార్కులు, అక్షర-580/600 మార్కులు, కె.రుచిత-579/600 మార్కులు, దాడించారని తెలిపారు. 550 ఆ పైన మార్కులు సాధించినవారు 18 మంది, 500పైన మార్కులు సాధించినవారు 16 మంది. తెలుగులో ఒకరికి, హిందిలో ఒకరికి, గణితంలో ఇద్దరికి, సోషియల్‌లో తొమ్మిది మంది 100కి 100 మార్కులు సాధించారని తెలిపారు. మిగతా విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారన్నారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన విద్యార్థులను, ఉపాధ్యాయులను పాఠశాల చైర్ పర్సన్ శాంత నాగరాజ్, బిసిఎన్ విద్యా సంస్థల సీఈఓ యన్.సాగర్ రాజ్, ప్రధానోపాధ్యాయురాలు దమయంతి, సుప్రియ మొదలైన వారు అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## స్కూల్ టాపర్ మాధవన్

**చిత్తూరు అర్బన్, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో చిత్తూరు నగరం లోని స్థానిక సంతపేట నందు గల లిటిల్ ఏంజిల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి వి. మాధవన్ 571 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడని ఆ స్కూల్ కరస్పాండెంట్ ప్రేమ కుమారి తెలిపారు. తమ పాఠశాలలో 500 కన్న ఎక్కువ మార్కులు పదిమంది విద్యార్థులు సాధించారని, కాగా అత్యధిక మార్కులు సాధించిన మాధవన్ తమ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడని, విద్యార్థికి ఉత్తమ విద్యా బోధన చేయడం తమ వంతు అయితే, కుటుంబంలో తల్లితండ్రులు సహకారం ఎంతో అవసరమని, ఇందులో భాగంగా విద్యార్థి తల్లిదండ్రులు



వినాయకం, దుర్గాలను కరస్పాండెంట్ ప్రేమకుమారి అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన మాధవన్‌తో పాటు ఇతర విద్యార్థులను పాఠశాల హెడ్ మాస్టర్ స్వర్ణలత, ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## పదిలో ప్రసన్న భారతి విద్యార్థుల ప్రతిభ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బుధవారం విడుదలైన 2024-25 10వ తరగతి



పరీక్షా ఫలితాల్లో స్థానిక కొర్లగుంట లోని ప్రసన్నభారతి స్కూల్ విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారని పాఠశాల వ్యవస్థాపకుడు కె.ఈశ్వరయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ పరీక్షలకు 55 మంది విద్యార్థులు హాజరు కాగా, అందులో 600మార్కులకు గాను టి.లిఖిత సాయి 580 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారని, ఎస్.శివప్రసాద్ 583 మార్కులతో ద్వితీయ స్థానంలోనూ, ఓ.యోగిత 579 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు.అలాగే 550 మార్కులకు పైగా పదిమంది విద్యార్థులు సాధించారని, 500 మార్కులకు పైగా 21మంది విద్యార్థులు సాధించడం అభినందనీయమన్నారు. ఇంతటి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారికి తగిన ప్రోత్సాహం, సహకారం అందించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## జ్యూస్ ఫ్యాక్టరీని పరిశీలించిన డీఎస్పీ

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** మండలంలోని అన్నూరు పంచాయతీ పరిధిలో ఉన్న ఏబిసి జూస్ ఫ్యాక్టరీని నగరి డీఎస్పీ మొహమ్మద్ అజీజ్ సందర్శించారు. అక్కడ పనిచేసే వర్కర్స్‌కి తీసుకోవలసిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ, లేబర్ యాక్ట్‌ల గురించి వారికి తెలియజేసి, యాజమాన్యానికి సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రయోజనాల గురించి తెలియజేడమైనది. ఈ కార్యక్రమంలో సీఐ హనుమంతప్ప, ఎస్సై రాజ కుమార్ పాల్గొన్నారు.

## పెట్రేగుతున్న రేషన్ మాఫియా

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందినప్పుడు, ఇతర సమాచార వ్యవస్థల ద్వారా ఉన్నతాధికారులకు సమాచారంఅందించిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పట్టణ ప్రజలు వాపోతున్నారు . యథేచ్ఛగా బియ్యం అక్రమ వ్యాపారం సాగుతున్న విషయాన్ని కొంతమంది ఉన్నతాధికారులకు అమ్యామ్యాలకు తలోగ్గి చోద్యం చూస్తున్నారు. కొంతమంది ఎండియూ ఆపరేటర్లు ముఠాగా ఏర్పడి పేదలకు అందించాల్సిన బియ్యంకు బదులు లబ్ధిదారులకు నగదు అందజేస్తూ ఆ రేషన్ బియ్యాన్ని బ్లాక్ మారేడుకు లక్షల్లో విక్రయిస్తున్నారు. ముఖ్యంగా బీడీ కాలనీ, లోతు వాని గుంట, పిచ్చిరెడ్డి తోపు, బేరిపేట, ఎల్ఏ సాగరం, తుమ్మూరు, తదితర ప్రాంతాల్లో రేషన్ బియ్యం సరఫరా చేసే ఆపరేటర్లు ఈ రకమైన దోపిడీకి పాల్పడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి తోడు పేదలకు అందించే బియ్యంలో కొలతల్లో అవకతవకలకు పాల్పడుతూ రెండు నుంచి మూడు కేజీల వరకు తగ్గించి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ విషయమై ఇటీవల స్థానికులు సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసిన తుత్తు మంత్రపు చర్యలతో చేతులు దులుపుకున్నారు.

### మమ్మల్నేమీ చేయలేరంటున్న వ్యాపారులు, ఆపరేటర్లు...

నాయుడుపేట పట్టణంలోని కొంతమంది ముఠాగా ఏర్పడి కొన్ని ప్రాంతాల నుంచి బియ్యం స్మగ్లర్లు చేరుకొని నాయుడుపేటలోని డంపింగ్ ప్రాంతాలకు చేరుకుని దర్జాగా రాత్రి పగలు తేడా లేకుండా కోట్ల రూపాయలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని దర్జాగా అక్రమ మార్గంలో తరలిస్తున్నారు. తమకు అధికారులఅండ ఉందని, ఎవరూ ఏమీ చేయలేరని ఈ రేషన్ మాఫీ ముఠా ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంతోనే ఆపరేటర్లు పలుచోట్ల రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. సివిల్ సప్లై అధికారులు మాత్రం కోట్లల్లో అక్రమ రేషన్ బియ్యం రవాణా జరుగుతున్న పట్టించుకున్న దాఖలాలు పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతుంటే నాయుడుపేట పట్టణంలో సివిల్ సప్లై అధికారులు ఉన్నారా లేరా అని పట్టణ ప్రజలు బహిరంగ విమర్శిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు బియ్యం అక్రమ వ్యాపారాన్ని అరికట్టి, సక్రమంగా లబ్ధిదారులకు రేషన్ అందేలా చర్యలు చేపట్టాలని నాయుడుపేట ప్రజలు కోరుతున్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో రైతులకు ఆదాయం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ, హార్టి కల్చర్ అసిస్టెంట్ల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పండించిన పంట మార్కెటింగ్ విధానంను రైతులకు తెలియజేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సబ్సిడీ కింద అందిస్తున్న ఆయిల్ పామ్ మొక్కలు, డ్రిప్ సౌకర్యం, డీజిల్/ఎలక్ట్రిక్ పంపు సెట్ లు, వ్యర్మీ కాంపోస్ట్, వ్యవసాయ యంత్రాలు, ట్రాక్టర్ల వివరాలను రైతులకు వివరించాలన్నారు. ఆయిల్ పామ్ పంట క్షేత్రాలలో కొకొ పంటను అంతర పంటగా వేసుకోవచ్చని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి 900 హెక్టార్‌లలో పంట సాగుకు లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, లక్ష్యాలను సాధించేలా వ్యవసాయ, హార్టి కల్చర్ సిబ్బంది పని చేయాలన్నారు. త్వరలో శాస్త్రవేత్తల ద్వారా పంట విధానం, మెలకువల పై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తామని, నాణ్యమైన మొక్కలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, ఏపీఎంఐపీ బాలసుబ్రమణ్యం, 3ఎఫ్, అమ్మ గోద్రెజ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, మురళి కుమార్,హరీష్, మురళీధర్, ఆర్ఎస్ కె ఇన్చార్జిలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయాలను సందర్శించిన ఎంపీడీఓ

**వాకాడు, మేజర్ న్యూస్:** వాకాడు మండల పరిధిలోని వాకాడు 1, నెల్లిపూడి, వాకాడు-2 గ్రామ సచివాలయంలను బుధవారం వాకాడు ఎంపీడీవో శ్రీనివాసులు సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ఉన్న గ్రామాలు జరుగుతున్న సర్వేలను గురించి ఎంపీడీవో సి.శ్రీనివాసులు సంబంధిత సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకోవడం జరిగింది, మనమిత్ర సర్వేని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో త్వరితగతంగా ప్రజలకి ఎటువంటి సందేహాలు లేకుండా వారికి ఈ మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్ గురించి రేపు మధ్యాహ్నం లోపు అవగాహన సర్వేని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించడం జరిగినది. ప్రభుత్వం దేశంలో ఎక్కడా కూడా ఇటువంటి ప్రయోగాత్మక నిర్ణయాలు తీసుకోలేదని, ప్రజలకి ప్రభుత్వ సేవలు మరింత సులభతరంగా మరియు వేగవంతంగా అందించే విధంగా ప్రభుత్వం తీసుకున్న ఈ మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌ని ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా ప్రజలను కోరారు, ప్రభుత్వం ఈ మన మిత్ర కోసం ఏర్పాటుచేసిన వాట్సాప్ నెంబర్ 9552300009 లో ప్రభుత్వం కార్యాలయ సేవలు అన్ని అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. పంచాయతీ సెక్రెటరీ ప్రవల్లిక, మహిళా పోలీస్ అమరావతి తదితరులు పాల్గొన్నారు.



## ఉగ్రవాదులది పిరికి పంద చర్య

**గూడూరు, మేజర్‌న్యూస్:** జమ్ము కాశ్మీర్‌లోని బైసారన్ దగ్గర పర్యాటకులపై ఉగ్రవాదులు తెగబడి 28 మందిని కాల్చివేయడాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ మూడు రోజులు సంతాప దినాలు పాటిస్తున్నట్లు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ తెలిపారు. మహాలక్ష్మమ్మ వీధిలో ఉన్న నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పతాకాన్ని అవనతం చేసి మృతులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా పిఓసి కె మోహన్, పట్టణ ఉపాధ్యక్షులు విజయ్, ప్రధాన కార్యదర్శి నాగార్జున, వంశీ కృష్ణ, మధుసూదన్ రావు, కార్యదర్శి ఉప్పు సాయి కిరణ్, మనోజ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



**బిజెవైఎం ఆద్వర్యంలో...** పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు వదిలిన 27మంది అమాయక హిందువులకు బిజెవైఎం నాయకులు మనోజ్‌కుమార్ ఆద్వర్యంలో ఘన నివాళులర్పించారు. గూడూరు పట్టణంలోని శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ వద్ద జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్ర దాడిలో ప్రాణాలు వదిలిన 27 మంది అమాయకలైన విహారయాత్రికులపై ముష్కర మూకలు కాల్చి చంపడం పిరికి పంద చర్యగా అభివర్ణించారు. టెర్రరిజంపై చర్యలు తీసుకుంటామని ఎవరిని వదిలే ప్రసక్తి లేదని తెలియజేశారని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో మల్లికార్జున, చంద్ర నీల్ బీజేవైఎం నగర అధ్యక్షులు శివశంకర్, ప్రదీప్ నవీన్ కిరణ్ ప్రసాద్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో కేజీబీవీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ




**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి ఫలితాలలో 34 మంది విద్యార్థులకుగాను 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. వీరిలో కె రజిత 561 మార్కులు సాధించి తిరుపతి జిల్లా లోని కేజీబీవీ విద్యాలయాల్లో మొదటి స్థానం నిలిచారని, ద్వితీయ స్థానం పి.వందన 527, తృతీయ స్థానం యు యోషిక 521 సాధించారు మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై చైతన్యం

**శాంతిపురం, మేజర్‌న్యూస్:** మండలంలోని 121 పెద్దూరు గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్



స్థిరమైన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే దిశగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ఓ శక్తివంతమైన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించడానికి ముఖ్య ఉద్దేశం. విద్యార్థులు నినాదాలుఇవ్వడం, ఫ్లకార్డులు చూపించడం ద్వారా ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను గ్రామస్తులకు తెలియజేశారు. దీని ద్వారా తేమ సంరక్షణ, కలుపు నివారణ, భూమి ముందస్తు సిద్ధీకరణ వంటి ప్రయోజనాలు రైతులకు లభిస్తాయని తెలిపారు. నేచురల్ ఫార్మింగ్ వల్ల తక్కువ ఖర్చు, భూమి ఆరోగ్యం మెరుగుపరచడం, నీటి నిలుపుదల పెరగడం, కాలానుగుణ మార్పులకు ఎదుర్కొనే శక్తి పెరగడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కొంతమంది రైతులు ఈ సీజన్ నుండి నేచురల్ ఫార్మింగ్ ప్రారంభించాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు షఫీ వారి. సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మూడు రోజులు సంతాప దినాలు

**కుప్పం, మేజర్‌న్యూస్:** ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశానుసారం పార్టీ కేంద్ర కార్యాలయం సూచనలు మేరకు ఉగ్రవాదదాడిలో మృతి చెందిన మృతులకు జనసేన ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సంతాప దినాలు నిర్వహించాలని నిర్ణయించిందని కుప్పం పార్టీ ఇన్చార్జి డాక్టర్ నరేష్ తెలిపారు. జమ్మూ కాశ్మీర్ నందు జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఉగ్ర దాడులకు వ్యతిరేకంగా కుప్పంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో కులాలకు అతీతంగా సామాన్య ప్రజల తరఫున శాంతియుత మౌన ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తున్నమని కావున జనసేన నాయకులు వీరమహిళలు జనసైనికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు మహాత్మా గాంధీ విగ్రహం దగ్గర నుండి బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు శాంతియుత మౌన ప్రదర్శన అనంతరం బస్టాండ్ సర్కిల్ నుండి క్యాండిల్‌తో ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతి కోసం మౌనప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. రెండవరోజు ఉదయం 9గలకు, కుప్పం ఆర్టీసీ బస్ స్టాండ్ సర్కిల్ నందు మౌన దీక్ష, కాండిల్ ప్రదర్శన, మూడవరోజు మౌన దీక్ష, మానవహారం ఉదయం 10గలకు, కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు డాక్టర్ నరేష్ తెలిపారు.

## పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విజయభేరి

**తడ, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో తడ మండలంలో వున్న ప్రభుత్వ పాఠశాల /హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి విజయభేరి మోగించారు. మండల విద్యాశాఖ అధికారి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. తడ మండలంలో వున్న 7హైస్కూళ్లలో పదవ తరగతి పరీక్షలకు హాజరైన 310 మంది విద్యార్థుల్లో 207 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ మల్లికార్జునరావు తెలిపారు. వీరిలో 500 పైగా మార్కులు నలుగురు బాలికలు సాధించారని తెలియజేశారు. తడ జడ్పీ హైస్కూల్ చెందిన పి.వర్షిని 567 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే పి మేఘన 565 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో గెలిచారు. తృతీయ స్థానంలో మండలంలోని చిన్నమాంబట్టు జడ్పీపీ హైస్కూల్‌కు చెందిన ఎన్ వర్షిత 565 మార్కులు సాధించగా తడ ఏపిఎంఎస్ చెందిన పి కమల కుమారి 553 మార్కులు సాధించి నాలుగో స్థానంలో నిలిచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏటా తమ పాఠశాలల్లో చదివే విద్యార్థిని, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ఘన విజయం సాధిస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి పి మల్లికార్జునరావు తెలియజేశారు.

## పోలీస్ స్టేషన్‌కు నాలుగు అగ్నిమాపక పరికరాలు వితరణ

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని కె.యం.పురం గ్రామానికి చెందిన తిరుమల రెడ్డి అతను కార్వేటినగరం పోలీస్ స్టేషన్ మరియు కార్వేటినగరం సర్కిల్ ఆఫీస్‌లకు రూ.10వేలు విలువ చేసే నాలుగు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే నాలుగు అగ్నిమాపక పరికరాలు బహుకరించినారు. అతనికి కార్వేటినగరం సీఐ హను మంతప్ప, కార్వేటినగరం ఎస్సైరాజ కుమార్ ధన్య వాదాలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ రైటర్ ఎన్.మునికృష్ణ పాల్గొన్నారు.



# పరువు హత్యకు పాల్పడిన తండ్రి, అన్న అరెస్ట్

**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:** మతాంతర వివాహం చేసుకుందని కన్న కూతురిని హత్య చేసిన తండ్రి, అన్నను అరెస్ట్ చేసినట్లు రెండవ పట్టణ సీఐ నెట్టికంటయ్య తెలిపారు. బుధవారం నగరంలోని స్థానిక రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హత్యకు పాల్పడిన నిందితులను మీడియా ముందు పోలీసులు హాజరు పరిచారు. రెండవ పట్టణ సిఐ నెట్టికంటయ్య మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు నగరంలోని బాలాజీ నగర్ నందు నివాసముండే షౌకత్ అలీ కుమార్తె యాస్మిన్ మతంతర ప్రేమ వివాహం చేసుకుంది. ఆమె వివాహం నచ్చని తండ్రి, యాస్మిన్‌ను చంపాలని పక్కా ప్రణాళికతో ఆమెను తన భార్య అక్క కొడుకు అయిన మహ్మద్ భాష, అలియాస్, లాలు, అబ్బుల్ తో కలిసి యాస్మిన్ తో మాట్లాడాలి అని చెప్పి వారి ద్వారా ఈనెల 13వ తేదీన చిత్తూరుకు రప్పించి చిత్తూరు నగరం లోని పిసిఆర్ కాలేజ్ వద్ద అద్దెకు తీసుకున్న స్కార్పియో వాహనంలో ఆమెను ఎక్కించుకొని ఇంటికి తీసుకు వెళ్తామని నమ్మించి మాపాక్షి క్రాస్ నందు గల బాలాజీ హ్యాచరీస్ సమీపంలో గల బీడు పొలాలలో వాహనము ఆపి ఆమెను పథకం ప్రకారం ముందుగానే తెచ్చుకున్న నూలు తాడును ఆమె గొంతుకు బిగించి హతమార్చారు. అనంతరం ఆమె శవాన్ని తీసుకుని వచ్చి షౌకత్ అలీ తన ఇంటి ముందర వరండాలో పడుకోబెట్టి మిగిలిన ఇద్దరు నిందితులు అయిన మహమ్మద్ భాష లాలు, అబ్బుల్ కలాంలతో కలిసి పరారయ్యారు. ఈ సంఘటన పై యాస్మిన్ తల్లి ఈనెల 14వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిత్తూరు రెండవ



పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.నెట్టికంటయ్య కేసునమోదు చేసి, నిందితులను అరెస్టు చేయడానికి రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ నెట్టికంటయ్య, ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ మహేశ్వర్, ఎస్.ఐలు సుగుణ, బలరామయ్య పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించబడిందన్నారు.

ఈ క్రమంలో మంగళవారం నిందితులు షౌకత్ అలీ, వయస్సు 56 సంవత్సరాలు, మహ్మద్ బాషా అలియాస్ లాలూ, వయస్సు అరెస్టు చేసి చిత్తూరు అర్బన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు అందించడం జరిగిందన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడు అబ్బుల కలామ్‌ను త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో నిరంతరం శ్రమించిన ఇన్స్పెక్టర్లు నెట్టికంటయ్య, మహేశ్వర్, ఎస్ఐ లు సుగుణ, బలరామయ్య క్రైం పార్టీ సభ్యులు బాబు, తవ్వరాజ్, రఫీ, వెంకటేష్ తదితరులను చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు అభినందించారు.

## ఎంపీ ఫిర్యాదుతో తిరుమల భద్రతా లోపాలపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సీరియస్

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** తిరుమలలో భద్రతా లోపాలపై తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి ఫిర్యాదు చేయడంతో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తక్షణ జోక్యం అవసరమని కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన ఫిర్యాదుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ అంశంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సెక్రటరీ మృత్యుంజయ్ త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. ఈ అంశంపై నిశితంగా పరిశీలించి సమాధానం పంపాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీని కేంద్రహోంశాఖ ఆదేశించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన తిరుమలలో భద్రత చాలా కీలకమని, అలాంటి చోట వరుసగా పునరావృతమవుతున్న భద్రతలోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎంపీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం విదితమే. ఈ లేఖలో భక్తుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కాని రెడ్ బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం పాలనపై పట్టు కోల్పోయిందని పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా లోపాలు భక్తుల జీవితాలను ప్రమాదంలో పడేయడంతో పాటు, వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. ప్రస్తుత టీటీడీ పాలక మండలి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.

## యగ్నోపవీతంలను కత్తిరించి డస్ట్ బిన్‌లో వేయడం దారుణం



**కుప్పం, మేజర్‌న్యూస్:** కర్ణాటక రాష్ట్రంలో బీదర్, షిమోగ్గా తదితర పట్టణంలలో జరిగిన సెట్ పరీక్ష సెంటర్‌ల వద్ద పరీక్షకు హాజరైన బ్రాహ్మణ విద్యార్థుల పట్ల అమానుషంగా ప్రవర్తనతో గాయత్రి మాత స్వరూపం అయిన యగ్నోపవీతంలను కత్తిరించి డస్ట్ బిన్‌లో వేయడం అత్యంత దారుణమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మైసూర్ శ్రీనివాస మూర్తి తీవ్రంగా ఖండించారు. కుప్పం పట్టణం సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతు హిందూ సనాతన ధర్మం యొక్క ప్రతినిధులు అయిన బ్రాహ్మణ విద్యార్థుల పట్ల, అనైతిక విధంగా హిందూ మత వ్యతిరేక ధోరణితో బ్రాహ్మణ విద్యార్థులు పరీక్షలకు హాజరు కాకుండ చేసే కుట్రగా కనిపిస్తుంది అని అన్నారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ విషయంపై న్యాయ విచారణ జరిపించి తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించి, యగ్నోపవితం తీస్తున్నారుఅని భయంతో పరీక్షకు హాజరు కాని విద్యార్థులకు,యగ్నోపవీతం తొలగించబడి వేదనతో పరీక్ష రాయలేని విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహించా లనీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు మైసూర్ శ్రీనివాస మూర్తి డిమాండ్ చేసారు.

## వసుంధర జ్యువెలర్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మేయర్ డాక్టర్ శిరీష

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న క్యాస్పన్ హోటల్లో వసుంధర గోల్డ్ అండ్ డైమండ్స్ వారు ఏర్పాటు చేసిన రెండు రోజుల (23,24)జ్యువలరీ ఎగ్జిబిషన్ ను తిరుపతి నగరపాలక మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ వసుంధర గోల్డ్ అండ్ డైమండ్ అంటే మనందరికీ తెలిసిన బ్రాండే,అందరికీ అందుబాటులో గోల్డ్ అండ్ డైమండ్స్ అందించడం వీరి ప్రత్యేకత అన్నారు. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో బ్రాంచులు కలిగి ఉన్న వీళ్లు ప్రతి సంవత్సరం లాగానే తిరుపతిలో రెండు రోజులు జ్యువెలరీ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన కలెక్షన్స్ మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటాయన్నారు. ప్రజల అవకాశానికి చేర్చుకోవాలన్నారు. అనంతరం వసుంధర గోల్డెన్ అండ్ డైమండ్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ రానున్న అక్షయ తృతీయాను దృష్టిలో ఉంచుకొని తిరుపతి, తిరుపతి పుర ప్రజలకు అందుబాటులో మంచి మంచి కలెక్షన్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలందరికీ నచ్చే



విధంగా చిన్న కలెక్షన్ నుంచి పెద్ద కలెక్షన్స్ వరకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.అంతేకాక విజయవాడ షోరూమ్ ప్రారంభించి 10 సంవత్సరాలైన సందర్భంగా ప్రత్యేక లక్కీ డ్రామా ఏర్పాటు చేయడం జరిగిందని ఇందులో రెండు లక్షలపైన కొనుగోలు చేసిన వారికి కూపన్ ఇస్తామన్నారు. గురువారం సాయంత్రం 7గంటలకు నిర్వహించే లక్కీ డ్రాలో కూపన్ ద్వారా గెలుపొందిన వారికి డైమండ్ రింగ్ బహుమతిగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వసుంధర గోల్డ్ అండ్ డైమండ్స్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు నీటి తొట్టెలను ఏర్పాటు చేసి మూగజీవులకు తాగునీరును అందించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

**పార్టీకి కష్టపడిన వారికి గుర్తింపు...** తెలుగుదేశం పార్టీకి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు మంచి గుర్తింపు నిచ్చి పదవులు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే కార్యకర్తలకు సూచించారు. పార్టీకి అహర్నిశలు కృషి చేసిన వారిని దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకొని వెళ్లడం జరుగుతుందన్నారు. పార్టీ పదవుల కోసం ఎవరిని ఆశ్రయించ రాదని ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ధైర్యం చేకూర్చారు. అనంతరం ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత శాఖలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పురుషోత్తం, ఉప తహసిల్దారు ఈశ్వర్ రెడ్డి, డిడిఓ ధనలక్ష్మి, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, దేవళం పేట సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం కరస్పాండెంట్ గుణశేఖర్ యాదవ్, స్థానిక ఎంపిటిసి తోకల మురళి రెడ్డి, సర్పంచులు బాబు, శశి ఆనందరెడ్డి, అంబు రాసి, క్లస్టర్ ఇంచార్జ్ చంగల్రాయిరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, నరసింహ యాదవ్ పాల్గొన్నారు.



# పది ఫలితాలలో శ్రీచైతన్య విజయభేరి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తిరుపతి జోన్‌లో ఉన్న శ్రీచైతన్య విద్యా సంస్థలు ప్రభంజనాన్ని సృష్టించాయని ఆ విద్యా సంస్థల ఏ.జీ.ఎమ్.జి.సురేష్ తెలిపా రు. ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం లో ఏ.జి.ఎమ్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో చైతన్య విద్యా సంస్థల్లో అత్యధిక మార్కులు 600కి 599 మార్కులు సాధించిన మా విద్యార్థిని వై.అనీషా అని,తిరుపతి జోన్ నందు అత్యధిక మార్కులు సాధించిన మా విద్యార్థులు ఆర్.సన్‌షిత రెడ్డి 600 మార్కుల కు గాను 597 మార్కులు, టి.రితిక్ రోషిని 596, కె.బ్రింద 595, ఎస్.శరణ్య, జి.సాయి మోక్షజ్ఞ, కె.లాస్య, పి.సాయి లేఖన, ఎమ్.త్రిశాంక్, పి.ఇందుప్రియ, ఎస్.వెంకట పవన్, డిజి.స్నేహిత్, కుషల్ వర్ప, హర్షిత, సాహిత్య 594 మార్కులు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. 590 పైన మార్కులు 80 మంది, 580 పైన మార్కులు 261 మంది, 575 పైన మార్కులు 356 మంది,550 పైన మార్కులు 753 మంది, 500పైన మార్కులు 1326 మంది సాధించా రన్నారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ప్రిన్సిపాల్లకు, కో-ఆర్డినేటర్ లకు, డీన్‌లకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీచైతన్య తిరుపతి జోన్ ఏ.జి.ఎమ్.జి.సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.



# శీతలాంబ విగ్రహ ప్రతిష్ఠలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తినియోజకవర్గం తొట్టంబేడు మండలం, పెద్దకనపర్తి గ్రామంలో గ్రామ దేవత శీతలాంబ విగ్రహ ప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పాల్గొన్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు పెద్దకనపర్తి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శీతలాంబ ఆలయ కమిటీ సభ్యులు శేష వస్త్రంతో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడును ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు స్కిట్ మాజీ చైర్మన్ గురు దశ రథన్, అంజూరు రఘురామయ్య, భాస్కర్‌నాయుడు, సుదర్శన్ నాయుడు, జానకిరామా నాయుడు, మహ దేవ్ రెడ్డి, కారకొల్లు హరిబాబు నాయుడు పాల్గొన్నారు.



# సిఎన్ఆర్ విద్యార్థుల విజయకేతనం



**గుడిపాల, మేజర్‌న్యూస్:** స్థానిక మండలంలోని సిఎన్ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారని పాఠశాల యాజమాన్యం లోకేష్ తెలిపారు. గత నెలలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మా పాఠశాల విద్యార్థులు పీఎం మనీషా 600 గాను 570 మార్కులతో మండలంలోని ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ స్థానంలో శ్వేత 568 మార్కులతో నిలిచా రన్నారు. రోషిని 502 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచార న్నారు. మంచి మార్కులతో ప్రతిభ కనపరచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు సుధ, ఉపాధ్యాయుల బృందం ప్రశంసించారు. ఇదే విధముగా ఉన్నత విద్యలలో కూడా మంచి మార్కులతో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు.

# టెన్త్ పరీక్షా ఫలితాల్లో చైతన్య భారతి స్కూల్ విజయభేరి

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బుధవారం విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డు సమీపంలోని చైతన్య భారతి స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురువేశారని పాఠశాల కరస్పాండెంట్ కె.జనార్ధన రెడ్డి తెలిపారు. ఇందులో ఎన్.హేమలత 600 మార్కులకు 587మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ద్వితీయ స్థానంలో ఎన్.మనోజ్ 582,టి.చందన 579మార్కులతో మూడవ స్థానంలో నిలిచారని తెలిపారు.మొత్తం మీద విద్యార్థుల్లో 87 శాతం మంది ఫస్ట్‌క్లాస్‌లో ఉత్తీర్ణులు కావడం అభినందనీయమన్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరు 500కు పైగా మార్పులు సాధించడం విశేషమన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థిని విద్యార్థులను కరస్పాండెంట్ కె.జనార్ధన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేంద్రనాథ్, ఇంచార్జ్ వెంకటరమణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ విజయానికి కృషి చేసిన అధ్యాపక బృందా నికి, విద్యార్థుల తల్లిదండ్రులకు జనార్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.



# పది ఫలితాల్లో టిఎంఆర్ ప్రభంజనం

## మండల ఫస్ట్ సాధించిన సుహాన
## అత్యధిక మార్కులు, అత్యుత్తమ ఫలితాలతో జయకేతనం

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** బుధవారం విడుదల చేసిన 2025 పది ఫలితాల్లో తిరుపతి జిల్లా, చిట్టమూరు మండలం, కొత్తగుంట లోని తంబిరెడ్డి మనోహర్ రెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు.ఎస్కె సుహాన 577/60 మార్కులతో మండలంలో మొదటి స్థానం సాధించింది. శ్రీసాయి సంజన 569 మార్కులతో రెండో స్థానంలో నిలిచింది. మండలంలో మొదటి, రెండో స్థానాలను టిఎంఆర్ విద్యా సంస్థలు దక్కించుకున్నాయి. టిఎంఆర్‌లో 50 మంది విద్యార్థులకు గాను 47 మంది పాసై 94 శాతం ఉత్తీర్ణత సాధించారు. 12 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు.మండలంలో మొదటి,రెండో స్థానాన్ని దక్కించుకున్న విద్యార్థులను అభినందించిన కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి,550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.పలువురు విద్యార్థులు గణితం,సాంఘిక శాస్త్రంలో 100/100మార్కులు సాధించడంపై ఉపాధ్యాయులు కె.శ్రీనివాసులు, బి.గోపాల్‌లను ప్రత్యేకంగా అభినందించారు. క్రమం తప్పకుండా టిఎంఆర్ విద్యార్థులు ప్రతి సంవత్సరం మండలంలో మొదటి, రెండో స్థానాలు సాధించి,అత్యధిక మార్కులు,అత్యుత్తమ ఫలితాలను నమోదు కావడంపై హర్షం వ్యక్తం చేసి విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించి,శుభాకాంక్షలు తెలియజేశారు.మారుమూల ప్రాంతంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యధిక మార్కులు, అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న టిఎంఆర్ విద్యాసంస్థలు క్రమశిక్షణ, అత్యుత్తమ బోధనతో మరిన్ని మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేయనున్నట్లు కూడా మనోహర్ రెడ్డి తెలియజేశారు.





# మృత్యుంజయుని రక్ష అందరికి లభించాలి

## దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ గ్యారేజ్‌లో శ్రీకాళహస్తి డిపో ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శ్రీ మృత్యుంజయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం యాగ పూజలు శాస్త్రయుక్తంగా చేపట్టారు. ఈ పూజారి కార్యక్రమాలకు ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌర అధ్యక్షులు, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు గ్యారేజీలో ప్రత్యేక యాగ శాల ఏర్పాటు చేసి కలశ స్థాపన పూజలు హోమ పూజారి కార్యక్రమాలను శాస్త్రవేత్తంగా నిర్వహించారు. అనంతరం నూతన శివాలయంలో శ్రీ మృత్యుంజయ స్వామి విగ్రహ ప్రతిష్ట శాస్త్రయుక్తంగా నిర్వహించి మహా కుంభాభిషేకాన్ని వేదో యుక్తంగా జరిపారు. విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేకం అనంతరం దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులను వేదపండితుల ఆశీర్వదించి తీర్థప్రసాదాలు బహూకరించారు.



అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతినిత్యం వేలాది మంది ప్రయాణికులను గమ్యస్థానంలో చేర్చడంలో కృషి చేస్తున్న ఆర్టీసీ సిబ్బందికి శ్రీ మృత్యుంజయ స్వామి రక్ష లభించాలన్నారు. అనుక్షణం ఆయురారోగ్యాలు అనుగ్రహించి ఎల్లవేళలా ఆర్టీసీ కుటుంబాలును, ప్రయాణికులు రక్షిస్తూ ఆనందం గా ఉండేలా దీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ముని చంద్ర ,శ్రీకాళహస్తి డిపో ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి శ్రీనివాసకుమార్, శ్రీధర్, రోసయా మురళి, భగ్యారాజ్, గుణశేఖర్, శివకుమార్,ఎంఎఫ్ కల్యాణ్ అమ్ఫ్,సిఐ చిట్టెమ్మా, సిఐపి.నిర్మలా, విజె కుమార్, బిఎస్ఆర్ కుమార్ పాల్గొన్నారు.

# ఎస్వీ జూలో అనారోగ్యంతో రాయల్ బెంగాల్ ఆడపులి మృతి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** స్థానిక శ్రీ వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూ) నందు రెండు సంవత్సరాల నాలుగు నెలల వయసు గల రాయల్ బెంగాల్ ఆడపులి(అనంత) అనారోగరీత్యా మంగళవారం రాత్రి మృతి చెందినట్లు జూ క్యూరేటర్ సి.సెల్వం బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మూడు నెలల వయసు ఉన్నప్పుడు 2023 మార్చి 10వ తేదీ ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ నుండి తీసుకొచ్చి జూలోని ఆసుపత్రి నందు మంచి వాతావరణంలో దానిని సంరక్షించామన్నారు. కొంతకాలానికి ఈ ఆడ పులిని పెద్ద ఎన్‌క్లోజర్‌లోకి మార్చడం జరిగిందని, అక్కడ అనుభవం కలిగిన జంతుసంరక్షకులతో దానిని పెంచుతూ వస్తున్నామన్నారు. జూ హెల్త్ అడ్వైజర్ కమిటీ క్రమం తప్పకుండా వాటి ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి, చికిత్సకు తగుసూచనలు అందించామన్నారు. మార్చి నెల చివరిలో అనంతకు అనురెక్సీయా, నీరసం సమస్య కారణంగా అనేక పరీక్షలు చేసి చికిత్స అందించినా,దాని ఆరోగ్యం మెరుగుపడలేదని తెలిపారు. జూ హెల్త్ అడ్వైజరీ కమిటీ అలాగే హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నవీన్‌కుమార్ దాని ఆరోగ్యాన్ని పరీక్షించి తగు సూచనలు అందజేశారు. మార్చి 21వ తేదీన అల్ట్రాసౌండ్, ఎక్స్ రే పరీక్షలు చేపట్టగా,దాని మూత్రపిండాలు అలాగే కాలేయం దెబ్బతిన్నట్లుగా గుర్తించామన్నారు. అనంతరం చికిత్స కొనసాగినప్పటికీ పులి పరిస్థితి విషమించి 22వ తేదీ మంగళవారం రాత్రి మృతి చెందిందన్నారు. మృతదేహానికి ఎస్ వి వెటర్నరి యూనివర్సిటీలో పాథాలజీ విభాగం ప్రొఫెసర్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించగా నెఫ్రిటిస్(కిడ్నీ వ్యాధి) ఉన్నట్లు గుర్తించాన్నారు. తరువాత జూ పోస్టుమార్టం గదిలో ఖననం చేయడం జరిగిందని ఆయన వివరించారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రభంజనం

### జిల్లా టాపర్‌గా శ్రీచైతన్య విద్యార్థి

**గూడూరు, మేజర్‌న్యూస్:** ప్రభుత్వ పాఠశాల్లో పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, గురుకుల పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో వెంకటగిరి గురుకుల పాఠశాల విద్యార్థిని కలపాటి ఇంద్రజ 594 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. మేనకూరు జెడ్పీ హైస్కూల్ ఆడేరు వందన 589 జిల్లాలో మూడవ స్థానం సాధించిందన్నారు. డివిజన్‌లో 123 ఉన్నత పాఠశాలల్లో 5380 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 3914 మంది 73 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. తళ్లంపాడు ఉన్నత పాఠశాలలో 35 మందికి 9 మంది 26 శాతం మంది, పుదూరు ఉన్నత పాఠశాలలో 33 శాతం ఆర్‌ఆర్ పాళెంలో 15మందికి 4 27 శాతం గూడూరు పరిధిలోని చెన్నూరు ఉన్నత పాఠశాల 38.కోట ఉన్నత పాఠశాలలో 53 మందికి 18 మంది 34 శాతం, కొండాగుంటలో 32కి 14మంది 44 శాతం, వంజవాకలో 19కి 8 మంది 42 శాతం నెల్లటూరు ఉన్నత పాఠశాలలో 18మందికి 7మంది 37శాతం మంది, వాటంబేడులో 37కి 15మంది 43శాతం, సూళ్లూరుపేటలో 65కి 27మంది 42శాతం, మన్నారుపోలూరులో 61కి 23 మంది 38 శాతం, చెన్నూరు 50కి 19మంది 38శాతం ఉత్తీర్ణత సాధించి తక్కువ ఫలితాలు సాధించారు. ఏరూరు శ్రీ వెంకట సరస్వతి పాఠశాల విద్యర్థిని సంకీర్తన 589 మార్కలతో చిల్లకూరు మండల టాపర్‌గా నిలిచింది. నెలబల్లి రెట్టపల్లి పాఠశాలలో 594 మార్కలతో మేఖల శేఖర, వెంకటగిరి ఉన్నత పాఠశాలలో 586 మార్కులు, సాధించారున్నారు.

**లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం...** పదో తరగతి ఫలితాలలో లిటిల్ ఏంజెల్స్ ప్రభంజనం సృష్టించింది 595 మార్కులతో ఏ పూజిత స్కూల్ టాపర్గా నిలిచారు. 587 మార్కులతో కృష్ణవేణి 580 మార్కులతో నరసింహులు ఉత్తమ ఫలితాలు సాధించారు పరీక్షకు హాజరైన 59మంది విద్యార్థులలో 41 మంది 500 పైన మార్పులు సాధించగా పరీక్ష రాసిన అందరూ విద్యార్థులు ఉత్తీర్ణులై 100% ఫలితాలు సాధించడం ఈ పాఠశాలకు విద్యార్థుల పట్ల అంకితభావాన్ని తెలియజేస్తుంది. ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధించడంలో భాగస్వాములైన విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయుల పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి కోఆర్డినేటర్ సుధేష్ణ అభినందనలు తెలియజేశారు ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సురేష్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

**జివిఎస్‌లో...** గూడూరు పట్టణంలోని జివిఎస్ పాఠశాల విద్యార్థి 591 మార్కులతో డివిజన్ టాపర్‌గా నిలవగా 123 మందికి 123 మంది ఉత్తీర్ణులైనట్లు కరస్పాండెంట్ పవన్‌కుమార్ తెలిపారు.

**శ్రీ చైతన్య రాష్ట్రంలో తృతీయ స్థానం...** 2024-25 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య రాష్ట్రస్థాయి మార్కులతో విజయ కేతనం ఎగురవేశారు. సాయి వైశాలి అనే విద్యార్థి 598 మార్కులతో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలువగా రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ అత్యద్భుతమైన ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు, శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎన్ శ్రీకాంత్, నెల్లూరు జోన్ రీజనల్ ఇంచార్జ్ వినయ్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్స్ భాషా, నాగరాజు, వెంకటేశ్వర్లు పాఠశాలలో విద్యార్థులను సన్మానించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్లు శ్రీహరిబాబు, హరి బ్రహ్మ యాదవ్, గాంధీ, ప్రైమరీ ఇంచార్జ్ చందన, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ కిరణ్మయి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సినీ తారల చేతుల మీదుగా బ్రోచర్ విడుదల

**వాకాడు, మేజర్ న్యూస్:** వాకాడులో శ్రేయఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో బుధవారం సినీ తారల చేతుల మీదగా నూతనంగా వేసిన లే అవుట్ బ్రోచర్ విడుదల చేశారు. సినీ ఇండస్ట్రీలో ఆస్కార్ విన్నర్, ప్రముఖసినీ గేయ రచయిత, సింగర్ చంద్రబోస్ మాట్లాడుతూ శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ సిఎండి డాక్టర్ బాబు అగస్టిన్ తలపెట్టిన శ్రేయ రియల్ ఎస్టేట్ తాను అంబాసిడర్ గా ఉన్నానని, ఆయన ఎక్కడ రియల్ ఎస్టేట్ వెంచర్ ఏసిన తాను వస్తానని, ముఖ్యంగా అగస్టిన్ నిబద్ధత, క్రమశిక్షణ పట్టుదల ఉన్న మంచి వ్యక్తితో తాను ఆయన దగ్గర ఎంతో తెలుసుకున్నానన్నారు. ఆయన వేసే ప్రతి వెంచర్ ప్రభుత్వ అనుమతులతో వేస్తారన్నారు. వెంచర్ ఒక మోడల్ గా ఉంటుందన్నారు. ప్రముఖ హీరోయిన్ ప్రియ హెగ్డే మాట్లాడుతూ శ్రేయ ఇన్ఫ్రా డెవలపర్స్ సిఎండి బాబు ఆగస్టిన్ వేసే ప్రతి అడుగు పర్ఫెక్ట్‌గా ఉంటుందని, వెంచర్ మోడల్ గా అన్ని విధాల అందంగా సుందరవదనంగా తీర్చిదిద్దుతాడని ప్రతి ఒక్కరు భూమి మీద దృష్టి పెట్టాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో హీరోయిన్ ప్రియాంక జైన్, శ్రేయ ప్రతినిధులు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎల్‌సి రమణారెడ్డి, స్థానిక నాయకులు, శ్రేయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.







# పదిలో ఒకేసారి పాసైన తండ్రి, కూతురు

**రొంపిచెర్ల, మేజర్‌న్యూస్:** మండలంలోని రొంపిచెర్ల గ్రామ పంచాయతీ, పాలెంవీధికి చెందిన తండ్రి, కుమార్తె పదవ తరగతి పరీక్ష రాసి ఒకే సారి పాసైన సంఘటన అందరూ ఆశ్చర్యానికి గురయ్యేలా చేసింది. తండ్రి బి.షబ్బీర్ 1995-96వ సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలు రాశారు. అయితే అప్పుడు ఫెయిల్ అయ్యాడు. అప్పట్లో ప్రమాదవశాత్తు గాయపడి వికలాంగుడిగా మారాడు.

ఏదైనా ఉద్యోగం సాధించాలని తపనతో కుమార్తెతో పాటు పదవ తరగతి పరీక్షలు రాశాడు. కుమార్తె బి. సమీనా రొంపిచెర్ల బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతోంది. తండ్రి బి. షబ్బీర్ ఓ ప్రైవేటు పాఠశాలలో ఓపెన్ స్కూల్లో పరీక్షలు రాశారు. ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాలు ఒకేరోజు రావడంతో తండ్రి, కుమార్తె ఇద్దరు పాస్ అయ్యారు. తండ్రికి 319 మార్కులు రాగా, కుమార్తెకు 309 మార్కులు వచ్చాయి. చదువుకు వయసు అడ్డం కాదని పలువురు మాట్లాడుకుంటున్నారు.

# టెన్త్ ఫలితాల్లో ఎస్.ఆర్ విద్యార్థుల హవా

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీనివాసపురంలోని ఎస్.ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఎప్పటిలాగే అత్యున్నత మార్కులు సాధించి తమ హవా కొనసాగించారు. ఇందులో జి.నిఖిల్ 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి పాఠశాల కీర్తిని పెంపొందించడం జరిగింది. తరువాత స్థానంలో నీలిమ 584,వైష్ణవి 581 జస్మిత 573 మార్కులు సాధించారు. అలాగే 90 మంది విద్యార్థులలో 59 మంది విద్యార్థులు 550 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల జోనల్ ఇంచార్జ్ రమేష్, డి.అశోక్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# తొట్టంబేడులో 69.1శాతం ఉత్తీర్ణత

### కాసరం, బోనుపల్లెలో వందశాతం ఫలితాలు
### 41.66శాతంతో చివరి స్థానంలో తొట్టంబేడు
### మండల టాపర్‌గా జోతీశ్వర్

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర విద్యాశాఖ వారు బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షల్లో తొట్టంబేడు మండల విద్యార్థులు 69.11శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో 272మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 188మంది ఉత్తీర్ణత పొందారు. కాసరం, బోనుపల్లె పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. తొట్టంబేడు ఉన్నత పాఠశాల 41.66శాతం ఫలితాలతో చివరి స్థానంలో నిలిచింది. పెద్దకనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎల్. జ్యోతీశ్వర్ అనే విద్యార్థి 589మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. ఇదే పాఠశాలకు చెందిన పి.పూజిత 559 మార్కులతో ద్వితీయ స్థానం బోనుపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన పి.యువరాజు 550, వై.లెనీనా 550 మార్కులు సాధించి మండలంలో మూడవ స్థానంలో నిలిచారు. పెద్ద కన్నలిలో 61మందికి 38మంది (62.29 శాతం), పూడిలో 27మందికి 22మంది (81.48శాతం), ఎగువ సాంబయ్యపాళెంలో 30మందికి 18మంది (60శాతం), గుండులిగుంటలో 25మందికి 19మంది (76శాతం), తొట్టంబేడులో 24మందికి 10మంది (41.66 శాతం), చిట్టత్తూరులో 15మందికి 8మంది (53.33శాతం), చియ్యవరంలో 20మందికి 18 మంది (90శాతం), బోనుపల్లెలో 12 మందికి 12మంది (100శాతం), కాసరంలో 5మందికి 5మంది (100శాతం), పెద్దకనపర్తిలో 23మందికి 18మంది (78.26శాతం), పిల్లమేడులో 15మందికి 12మంది (80శాతం), లింగమనాయుడుపల్లెలో 15మందికి 8మంది (53.33శాతం) ఉత్తీర్ణత సాధించారు.









## డీ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానం

**కార్వేటినగరం (మేజర్ న్యూస్):** కార్వేటి నగరంలో ఉన్న జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్‌లో డీ సెట్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైట్ ప్రధానచార్యులు డాక్టర్ శేఖర్ తెలిపారు ఆయన మాట్లాడుతూ జిల్లా విద్యాశిక్షణా సంస్థ, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా నందు డీసెట్-2025 నకు ప్రవేశము కొరకు ఆన్లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు స్వీకరించబడును. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపుటకు 08.05.2025 వరకు సమయముగలదు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనవలిసిందిగా రెండు సంవత్సరముల కోర్స్ చేయుటకు ఆసక్తి కలిగి ఉన్నవాళ్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలెనని ఆయన తెలిపారు.

## పది పరీక్షల్లో 85.2శాతం ఉత్తీర్ణత

**రామచంద్రపురం, మేజర్‌న్యూస్:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఆర్సిపురం విద్యార్థులు 85.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు జయవేలు తెలిపారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు అభినందించారు.



వారు మాట్లాడుతూ 9 ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 213 మంది ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. కేకేవిపురం ఉన్నత పాఠశాల నాగూర్ కాలనీకి చెందిన షహనాజ్ 570 మార్కులతో ప్రథమ స్థానం, కుప్పం బాదూరు ఉన్నత పాఠశాల పీవీ పురానికి చెందిన హరి ప్రసాద్ రెడ్డి 566 మార్కులతో ద్వితీయ స్థానం, అలాగే కేకేవీ పురం ఉన్నత పాఠశాల వడ్డిపల్లెకు చెందిన రిషిత 557 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్లు వివరించారు. కేకేపురం ఉన్నత పాఠశాల 96% కుప్పం బాదూరు ఉన్నత పాఠశాల 92%తో మొదటి రెండు స్థానాలు సాధించాయి. కమ్మ కండ్రిగ ఉన్నత పాఠశాల 68%తో చివరి స్థానంలో నిలిచింది. అనంతరం మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పది పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## మృతదేహానికి విజయానంద రెడ్డి నివాళులు

**గుడిపాల, మేజర్‌న్యూస్:** మండలంలోని కుప్పిగానిపల్లి గ్రామానికి చెందిన ప్రేమకుమార్



మృతదేహానికి వైఎస్ఆర్సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ్ విజయానందరెడ్డి నివాళులర్పించారు. ప్రేమకుమార్ మృతి ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఈ సమయంలో కుటుంబానికి మనోధైర్యం చాలా అవసరం అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు ప్రకాష్ నాయకులు, పాల్గొన్నారు.

## మృతులకు స్కాట్స్ అండ్ గైడ్స్ నివాళి

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి శ్రీకాళ హస్తి గాంధీ మహాత్ముని విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జమ్మూ, కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిలో 28మంది



పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం దారుణమన్నారు. ఉగ్రవాదులు ఉనికి కోసం అమాయకుల ప్రాణాలు తీయడం హేమమైన చర్య అన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కమిషనర్ టి. రమేష్ బాబు, జిల్లా ఇంచార్జి కార్యదర్శి జి. విజయకుమార్, యూత్ చైర్మన్ అజారుద్దీన్, స్కాట్ మాస్టర్ విద్యాసాగర్, నిఖిల్, తనూజ్ కుమార్, స్కాట్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పది పరీక్ష ఫలితాల్లో నలంద విద్యార్థుల ఘనవిజయం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ




తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక మంగళం రోడ్, కొత్తపల్లిలోని నలంద స్కూల్ విద్యార్థులు ఘన విజయం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ ఓబుల వెంకట రమణా రెడ్డి, డైరెక్టర్ ఓబుల ఆనంద రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులలో కె.జోష్ణ 600 మార్కులకు గాను 581 మార్కులు సాధించి పాఠశాల టాపర్గా నిలిచారన్నారు. పి.చతురా రెడ్డి 575, డి.ప్రణతి 562,జి.స్నేహ 557,కె.డింపు ప్రియ 550 మార్కులు సాధించి విజయ పతాకం ఎగురవేశారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే 14 మంది విద్యార్థులు 500 మార్కులు పైగా సాధించి తమ పాఠశాల గౌరవాన్ని నిలిపారని కొనియాడారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు,వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదులదాడి పిరికి పందల చర్య: చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**తిరుపతి రూరల్, మేజర్‌న్యూస్:** కాశ్మీర్ సమీపంలోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర వాదులు దాడి జరపడం పిరికిపందల చర్యని చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దుశ్చర్యలను ఖండిస్తూ నల్ల బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ సైనిక దుస్తులలో వచ్చిన ముష్కరులు మారణకాండకు దిగడం హేయమైన చర్య అన్నారు. పర్యాటకులపై తుపాకులు ఎక్కుపెట్టి దుర్మార్గంగా కాల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భారత సైన్యం ఉగ్రవాదులను ఏరివేయడానికి సన్నద్ధం కావాలని కోరారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉగ్రవాదుల చేతిలో అకాల మరణం చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కుటుంబ సభ్యులకు ఆత్మస్థైర్యాన్ని కల్పించాలని,




క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ నిరసన కార్య క్రమంలో వైస్ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు హరికృష్ణారెడ్డి, జయకర్, వెంకటరమణ, కోటి, మన్నూరు శివ, రవి, రాజ, భారతి, అరుణ్, ప్రకాష్, హేమాద్రి, విజయలక్ష్మి, శశి, కుప్పిరెడ్డిగారి ప్రతాప్‌రెడ్డి, గురు స్వామిరెడ్డిలు పాల్గొన్నారు.

## పదిలో రాయలపేటలో 99 మంది పెద్దపంజాణిలో 30 మంది ఫెయిల్

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పెద్దపంజాణి మండలం రాయలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 99 మంది, పెద్దపంజాణి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. కాగా మండలంలో ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలతో



పాటు 12 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 6560 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా అందులో461 మంది ఉత్తీర్ణులయ్యారు. 195 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు. ఇందులో ఒకే పాఠశాలకు చెందిన 99 మంది, మరొక పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం గమనార్హం. ప్రభుత్వం ఆధునిక వసతులతోపాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించినా ప్రతి సబ్జెక్టుకు ఉపాధ్యాయులను నియమించినా పదవ తరగతిలో ఒకే పాఠశాలలో 99 మంది మంది విద్యార్థులు పరీక్షలు తప్పడం, మండలంలో గల ఏకైక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అన్ని మౌలిక వసతులతో పాటు అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నా 30 మంది విద్యార్థులు కావడం మండలంలో చర్చనీయాంశమైంది. విద్యార్థుల పట్ల చదువుల పట్ల సరైన సిద్ధపరచకపోవడం, ఉపాధ్యాయులు వారివారి సబ్జెక్టులలో విద్యార్థులకు సరిగా అవగాహన కల్పించకుండా వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడంలో విఫలమవడం, ముఖ్యంగా అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పట్ల సమన్వయనం లోపించడంతో, ఉపాధ్యాయులు సరైన బోధనా పద్ధతులను అవలంబించ పోవడం, విద్యార్థులకు సరైన క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించక పోవడమే పెద్దపంజాణి మండలంలో పదవ తరగతి పరీక్షలలో చాలామంది ఫెయిల్ కావడానికి కారణమని మండలంలో ప్రజలు చర్చించుకుంటున్నారు.

## పది ఫలితాల్లో నవోదయ విద్యార్థుల ప్రభంజనం

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నాయుడుపేట పట్టణంలోని నవోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్పులతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనం సృష్టించారు. పాఠశాల కరస్పాండెంట్ ఇ.పద్మనాభరెడ్డి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. తమ పాఠశాల నుండి 55 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలకు హాజరు కాగా 55 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. డి.ప్రఘ్నేష్ కుమార్ 584 మార్కులు సాధించి పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే కె. ఉషశ్విని 582 మార్కులతో పాఠశాల ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. జి చరిష్మా 579 మార్కులతో





పాఠశాల తృతీయ స్థానం సాధించినట్లు తెలియజేశారు. 27 మంది విద్యార్థులు 500 మందికి పైగా మార్కులు సాధించి రికార్డు సృష్టించారని తెలిపారు. తమ పాఠశాల స్థాపించిన నాటి నుండి పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు తెలియజేశారు.

## పదవ తరగతి పరీక్షల్లో మండలంలో 72శాతం ఉత్తీర్ణత

**కార్వేటినగరం (మేజర్‌న్యూస్):** కార్వేటినగరం మండలంలో పదో తరగతి పరీక్షల్లో 72% ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారులు విజయ్‌కుమార్, మనోజ్ కుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో కత్తెరపల్లి పాఠశాలకు చెందిన ప్రశాంత్ 576 మార్కులు సాధించి మండలంలోని మొదటి స్థానంలో నిలిచాడు. చిన్ని 546 మార్కులతో ద్వితీయ స్థానం, ఎన్ గాయత్రి 534 మార్కుల తో తృతీయ స్థానం, తరుణ్ 519 మార్కులు, హారిక 519 మార్కులతో నాల్గవ స్థానంలో నిలిచారు. ద్యాని 518, జాహ్నవి 507 మార్కులు సాధించారు. 73 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు చెంగల్ రాజు అభినందనలు తెలిపారు. రాజా కుమార్ స్వామి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 74% సాధించారు. హేమంత్ 536 మార్కులు, మేఘశ్యామ్ 531, గీతిక 527, ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు తెలిపారు. 500పైగా 9 మంది విద్యార్థులు విద్యార్థులు సాధించడంపై వారిని అభినందించారు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డిఎం పురంలో 72% ఉత్తీర్ణత చరణ్ తేజ 52 2, కమల్ 520, మౌళి 511, దేవి ప్రియ 510, అయ్యప్ప 509 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు కేశవులు తెలిపారు, ఆర్కే వి



బీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 88% మంది పాసైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణ్ కుమార్ తెలిపారు, బాలికల ఉన్నత పాఠశాలలో 84% ఉత్తీర్ణత, ఉమా వీరిలో ఉమామహేశ్వరి 533, యామిని 511, సౌజన్య 508 మార్కులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి దేవి తెలిపారు. ఈ పాఠశాలలో 500పై వచ్చిన వారిని అభినందించారు.

## పదవి విరమణ ఎంఈఓకి ఘన సన్మానం

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** దొరవారిసత్రం మండల కేంద్రంలో శెట్టిపల్లి మునిశేఖర్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తూ బుధవారం పదవి విరమణ సందర్భంగా ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారిని ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో గోవర్ధన్ మాట్లాడుతూ మండలంలో విద్యాశాఖ అధికారిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, రాధాకృష్ణయ్య, కె.శ్రీనివాసులు, రమేష్, విజయ్‌కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఫలితాలు సాధించిన గురుకుల విద్యార్థులు

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** పదవ తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. మండల పరిధిలోని బిసి గురుకులం (బాలురు) కస్తూర్బా గాంధీ విద్యాలయం (బాలికలు)ఏపీ మోడల్ స్కూల్ (మావిళ్ళపాడు)లో విద్యాభ్యాసం కొనసాగించిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలిగారు. బిసి గురుకుల పాఠశాలలో 77 మంది విద్యార్థులకు గాను 72 గురు ఉత్తీర్ణత సాధించి 93.5% శాతంలో నిలిచారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని బాలికలు 32 /34 పాస్ అయ్యారు.అదేవిధంగా మావిళ్ళపాడు లోని మోడల్ పాఠశాలలో51 మందికి 38 మంది ఉత్తీర్ణులై 75% శాతంలో నిలిచారు.కానీ మండల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తీర్ణత శాతం తగ్గుముఖం పట్టింది.విద్యార్థుల విద్యాభ్యాసంలో లోపమా! ఉపాధ్యాయుల బోధనలో లోపమా ఫలితాలు సాధించడంలో సర్కారు బడులు వెనుకబడ్డాయి.1) శ్రీ ధనమలి హైస్కూల్లో నిర్విఘ్ని 560 మార్కులు సాధించింది.తల్లంపాడు,ఏకొల్లు, పూలతోట,కల్లూరు హైస్కూల్ విద్యార్థులు స్వల్ప సంఖ్యలోనే ఉత్తీర్ణత చందారు. ఉచ్చూరు 71%శాతం ఫలితాలు సాధించారు. ఉత్తీర్ణత ఫలితాలు దిగజారిపోవడంతో పిల్లల తల్లిదండ్రుల్లో కూడా బోధన సరిలేదని కారణంతో వారి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కార్పొరేట్ బడులవైపు మొగ్గుచూపే అవకాశాలు కూడా లేకపోలేదు. జిల్లా విద్యాశాఖ లోపాలను గుర్తించి నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించ లేకపోతే, రాబోవు రోజుల్లో సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.





## పర్యాటకులపై దాడి అమానుషం

### విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు

**పుంగనూరు, మేజర్ న్యూస్:** శ్రీనగర్‌లో పహల్గంలో పర్యాటకులపై దాడి అమానుషమని విశ్రాంతి డిఎస్పి సుకుమార్ బాబు బుధవారం విలేకరులతో అన్నారు. ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో మరణించిన అమాయక ప్రజల ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇటువంటి సంఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. త్వరలోనే మన మిలిటరీ వారిపై తగిన ప్రతీకారం తీర్చుకుంటుందని ఒక విశ్రాంత పోలీస్ డిఎస్పీగా నేనుచాలా బాధపడుతున్నానన్నారు.

## శీతలంబ విగ్రహ ప్రతిష్టలో మాజీ ఎమ్మెల్యే బియ్యపు

**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలోని పెద్దకనపర్తి గ్రామంలో గ్రామ దేవత శీతలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పెద్దకనపర్తి ప్రజలు స్వాగతం పలికిన అనంతరం శీతలాంబ వారి శ్రీపోలేరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మణి నాయుడు, అంజూరు రఘురామయ్య, అంజూరు వసంతయ్య,అంజూరు కృష్ణ, కనపర్తి పాపయ్య, కనపర్తి చలపతి, పసుపులేటి సుధాకర్, తిరుపాల్, గోపి, సుబ్రహ్మణ్యం, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధనమున్న రాయల్, మాజీ కౌన్సిలర్ కంత ఉదయ్ కుమార్, నియోజవర్గ యువత అధ్యక్షులు శ్రీవారి సురేష్,మైనంపాటి దయాకర్, ప్రసాద్, అంకయ్య, గంగయ్య యాదవ్, పసుపులేటి చిన్నా, అంజూరు మణి, అంజూరు వెంకటేష్, అంజూరు శేఖర్, కానగల పద్మనాభం, కానగల పురుషోత్తం, వీరస్వామి, రాజా, రవి, వీరాస్వామి పాల్గొన్నారు.



## నూరు శాతం సాధించిన సోక్రటీస్



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వెదురుకుప్పం మండలం దేవలంపేట సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గుణశేఖర్ తెలిపారు. 17 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 17 మంది ఉత్తీర్ణత సాధించారని, ఆరుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని, పదిమంది విద్యార్థులు 400పైగా మార్కులు సాధించినట్లు కరస్పాండెంట్ తెలిపారు. గత సంవత్సరంలో సైతం నూటికి నూరు శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన చెప్పారు.

## 35 లీటర్ల నాటు సారా స్వాధీనం, ఇద్దరు అరెస్టు

**కుప్పం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని బ్రహ్మదేవరచేను గ్రామం నందు బుధవారం ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ కుప్పం ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులలో భాగంగా అక్రమంగా నాటు సారా విక్రయం చేయడానికి నిల్వ ఉంచుకున్న ఒక బ్లూ ప్లాస్టిక్ క్యాన్‌లోని 35లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు కుప్పం ఎక్సైజ్ స్టేషన్ సీఐ నగరాజ్ తెలిపారు. బ్రహ్మదేవరచేను గ్రామానికీ చెందిన తిరుపతి, వీర్నమల గ్రామానికి చెందిన ఆర్.గోవిందన్ అను ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు పలమనేరు పంపగా 15 రోజులు రిమాండ్‌కు మదనపల్లిలోని సబ్‌జైలుకు పంపించడం జరిగిందనీ తెలిపారు. పై కేసులో ఇద్దరికీ సారా సరఫరా చేసిన వీర్ణమలకు చెందిన రాజేంద్ర అనే వ్యక్తిని కూడా అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు. బ్రహ్మదేవరచేను గ్రామంలో కానీ చుట్టుపక్కల కానీ నాటు సారాయి అమ్మినా, తయారీ చేసినా చట్టపరమైన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు, ఎస్సై మోహన్ బాబు, దిలీప్ కుమార్ సిబ్బంది చలపతి ఆచారి, వెంకటేష్, రమేష్, కిరణ్, పద్మావతి, స్థానికులు పాల్గొన్నారు.



## పది ఫలితాల్లో మెరిసిన విద్యా సుకుమాలు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 71.4 శాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించారు. మండలంలో ఆరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన మొత్తం 189 మంది (బాలురు99, బాలికలు 90) విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాశారు. వీరిలో 135 మంది( బాలురు79, బాలికలు56) ఉత్తీర్ణులయ్యారు. తాళ్వాయి పాడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నిఖిలశ్రీ 575 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే శిరసనంబేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హిందూ ప్రియ 560 మార్కులతో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే పాలచ్చూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన సునీత మార్కులతో 559 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.



## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని నెలబల్లి గ్రామ సమీపాన ఉన్న జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నెలబల్లి గ్రామానికి చెందిన, పున్నేపల్లి పోలయ్య(50) అను అతను మృతి చెందాడు, వివరాల మేరకు పోలయ్య నెలబల్లి లోని హరిజనవాడకు బైక్ పై వెళ్లి తిరిగి తన ఇంటికి వస్తూ ఉండగా జాతీయ రహదారి సర్కిల్‌ను దాటుతున సమయంలో చెన్నై నుండి హైదరాబాదుకు వెళుతున్న కారు మోటార్ బైక్‌ను ఢీకొన్నది దీంతో బైకుపై ఉన్న పోలయ్య అక్కడకక్కడే మృతి చెందాడు ఈ విషయం తెలుసుకున్న దొరవారిసత్రం ఎస్సై అజయ్ కుమార్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు అనంతరం బైకును ఢీకొన్న కారుని ఎస్సై అదుపులోకి తీసుకున్నారు.

మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ హాస్పిటల్‌కి తరలించి బుధవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తన బంధువులకు అప్పగించారు మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు, పోలయ్య మృతి చెందడంతో భార్య పిల్లలు గ్రామస్తులు బంధువులు కన్నీరు మున్నీరుగా ఏడవసాగారు. ఈ కేసును ఎస్సై అజయ్ కుమార్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టుగా తెలిపారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**నాయుడుపేట, మేజర్‌న్యూస్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి కుమార్తె వాకాటి సాహితీ రెడ్డి వివాహ మహోత్సవంలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. బుధవారం హైదరాబాదులోని ఓ కళ్యాణ మండపంలో వాకాటి సాహితీ రెడ్డి వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులతో పాటు మాజీ ఎంపీ సులూరుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు గున్నం మధుసూదన్ రెడ్డి, దేవా రెడ్డి సుధాకర్ రెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, దేవా రెడ్డి నాగేందర్ రెడ్డి, పలువురు నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు.



## మండలంలో 96శాతం ఉత్తీర్ణత

### ఎంఈఓలు హసన్ బాషా, గణపతి

**గుడిపాల, మేజర్‌న్యూస్:** బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో గుడిపాల మండలం 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి హసన్‌బాషా గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాల మండలంలో 274మంది పరీక్షకు హాజరు కాగా 262 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మండలంలో నీ కమ్మతిమ్మాపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సింధు భార్గవి 564 మార్కులతో మొదటి ర్యాంకును సాధించారని తెలిపారు. దేవి విద్యా మందిర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏఎల్.పురం 100 శాతం, బొమ్మసముద్రం శ్రీరంగంపల్లి 97 శాతం, కమ్మతిమ్మపల్లి 95 శాతం, నరహరిపేట 96 శాతం, చిత్తపార 88 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు.



## ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ ట్యాబ్‌లు పంపిణీ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదివి నేడు వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు నేడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ అభినందించి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇలాగే జిల్లాలో మంచి ఫలితాలను తీసుకువచ్చి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించేలా విద్యార్థుల వెన్నంటే ఉండి కృషిచేసిన విద్యాశాఖ, ప్రభుత్వ పాఠశాలలలోని ఉపాధ్యాయులను అభినందించారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కే.ఇంద్రజ(594/600) దక్కిలి మండలం, చాపలపల్లి మున్సిపల్ హైస్కూల్, ఎం.సేవిత (591/600), జడ్పీ హైస్కూల్, కోటకాడపల్లి ఎర్రవారి పాలెం మండలం, ఏ.వందన (589/600) జడ్పీహైస్కూల్, మైనకురు, నాయుడుపేట మండలం, ఏ కేతన్ (589/600), మున్సిపల్ హైస్కూల్ అగ్రహారం పల్లి.





## ఉగ్ర దాడిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి ఖండన

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్:** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఇదని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం జరిగే విదంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఎంపీ గురుమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



## క్రీడా మంత్రిచే ధ్యాన్ చంద్ విగ్రహావిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** బుధవారం స్థానిక శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణము నందు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ బహుకరించిన హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విచ్చేసి ఆయన చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు,శాప్ చైర్మన్ రవి నాయుడు, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్.శ్రీధర్, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి శివప్రసాద్, టైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి విజయ్ కుమార్,రైఫిల్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజులు, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి హరి, జెన్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్,కరాటే అసోసియేషన్ కార్యదర్శి డిసిఎస్. నాయుడు, ఫుట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి మునెయ్య, రెజ్లింగ్ కార్యదర్శి ఉదయ్ కుమార్, రోల్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రేమ్ నాథ్, డిఎస్ డిఓ అధ్యక్ష కార్యదర్శులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



## తిరుమలలో భాష్యకారుల ఉత్సవం ప్రారంభం

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజులు ఈ ఉత్సవం జరుగనుంది. మే 2న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంత పరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. శ్రీరామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.





## పరిహారం అందించిన తర్వాత భూముల్లో పనులు చేయాలి

**గూడూరు, మేజర్‌న్యూస్:**

గూడూరు నియోజకవర్గ పరిధిలోని కోట, చిల్లకూరు మండలాల్లో కృష్ణపట్నం దక్షిణ నోడ్‌కు భూముల సేకరణలో నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాత పనుల చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం గూడూరులో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలసిన నాయకులు సాగు చేసుకొంటున్న భూముల్లోని వేరుశనగ పంటను జె.సి.బి.లతో ధ్వంసం చేయడం ఘోరమన్నారు. పంట 20 రోజుల్లో చేతికి వస్తుందని రైతులు పేర్కొంటున్నా పంటను క్రిస్ సిటీ సిబ్బంది జె.సి.బి లు పెట్టి ధ్వంసం చేస్తున్నారని దీన్ని ఆపాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం అధికారులు పెద్దల పక్షాన చేరి, పేదల భూములను ధ్వంసం చేయడం వలన సన్న, చిన్న, కారు రైతులు వీధిన పడ్డారని చేతికి వచ్చిన పంటకు కూడా నష్టపరిహారం ఇప్పించకుండా అధికారులు చేతివాటం ప్రదర్శిస్తూ, ప్రశ్నించిన రైతులపై కేసులు పెడతామని, బెదిరించడం సబబుగా లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు పంటలను ధ్వంసం చేయడం ఆపాలని, వారు డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్ట ప్రకారం అందరికీ పరిహారం అందించాలని వారు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు రైతు సంఘం నాయకులు జోగి. శివకుమార్, బి.వి.రమణయ్య పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



జనం కోసమే
సూర్య
మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్త ంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

ఎన్.లక్ష్మినారాయణ, రీజనల్ మేనేజర్, ఫోన్ నెం... 63011 07116, కె. సురేష్ బాబు, బ్రాంచ్ మేనేజర్, ఫోన్ నెం... 93463 18232